## క్లుప్తంగా

### ముందస్తు స్వాతంత్య్ర వేడుకలు



స్వాతంత్య్ర దినోత్సవ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**పుత్తూరు రూరల్:** మండల పరిధిలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకున్నారు. సోమవారం 77వ స్వాతంత్య్ర దినోత్సవ నమూనాను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ

**పుత్తూరు రూరల్:** దేశ స్వాతంత్య్రం కోసం వేల మంది ప్రాణత్యాగం చేశారని వారి ఆశయాలకు అనుగుణంగా నేటి యువత కృషి చేయాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీ.శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ నిర్వహించారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ప్రతి భారతీయుడు ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి రఘురామన్, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు సుజన, నాగేశ్వరరావు, నరసింహులు పాల్గొన్నారు.

### మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**పుత్తూరు రూరల్:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గోవిందయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం గోపాలకృష్ణపురం గ్రామం వద్ద 43 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని గోవిందయ్య వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

### కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కన్నికలమ్మ తల్లి

**పాలసముద్రం:** మండలంలోని కృష్ణజమ్మపురం కట్టకింద వెలసిన కన్నికలమ్మకు సోమవారం ఆడి నెల పురస్కరించుకుని గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం సర్పంచ్ రవి ఉభయదారులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

### కొండమల్లీశ్వరుడికి ముువ్వన్నెల జెండా అలంకరణ



**వెదురుకుప్పం:** మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు భక్తి ప్రపత్తులతో అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారిని మూడు రంగుల జెండా అలంకరణలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

### జనావాసంలోకి కొండ చిలువలు



కొండచిలువను చూపుతున్న స్థానికులు

**శ్రీరంగరాజపురం:** జనావాసంలోకి రెండు కొండ చిలువలు వచ్చిన సంఘటన శ్రీరంగరాజపురం మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెద్దతయ్యూరు గ్రామం రవికి చెందిన వేరుశనగ పొలంలోని కూలీలు కలుపు తీస్తుండగా పొలంలో ఉన్న కొండచిలువను గుర్తించారు. అలాగే ఆదే గ్రామంలో కాలువలో చేపల వేటకోసం వెళ్లిన స్థానికులు చేపలు పడుతుండగా సమస్ అనే వ్యక్తిని కొండ చిలువ కాలువను చుట్టుకుంది. భయంతో అతను అరవడంతో అక్కడే ఉన్న స్థానికులు రెండు కొండచిలువలను చంపివేశారు.

# డ్రాగన్ పండు | ఔషధాలు మెండు

- ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే డ్రాగన్ ఫ్రూట్ సాగులో వైద్యసిబ్బంది
- ఒక్కసారి పెట్టుబడి.. 25 ఏళ్ల పాటు రాబడి
- పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం చేయూత
- పండ్ల తోటల సాగుకు రుణాలు పొందే సదుపాయం



సుద్దగుంట వద్ద సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట

**అందరిలా సాధారణ పంటలు సాగు చేయకుండా సరికొత్తగా ఆలోచించారు ఆ దంపతులు.. వృత్తిరీత్యా వారు వైద్యరంగంలో ఉన్నా.. వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో వారు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో ఔషధ గుణాలు కలిగిన డ్రాగన్ పండ్లకున్న డిమాండ్ గురించి తెలుసుకున్న ఆ వైద్య ఉద్యోగులు పలు జిల్లాల్లో పర్యటించారు. పంట సాగులో చేపట్టాల్సిన అంశాలపై అధ్యయనం చేశారు. గతేడాది వారు ఏలూరుకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న పులిపాడు వద్ద జంబో డ్రాగన్ తైవాన్ పింక్ రకం విత్తనాలను తీసుకొచ్చి ప్లాస్టిక్ సంచుల్లో కొంతకాలం పెంచారు. అవి బాగా వేర్లు వచ్చాక అర ఎకరం పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోటను సాగు చేశారు.**

**కార్వేటినగరం:** ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేసే డ్రాగన్ ఫ్రూట్‌కు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పీచు పదార్థం కలిగి, పోషకాలు ఉన్న పండుగా డ్రాగన్ ఫ్రూట్‌కు గుర్తింపు. ఇటీవలి కాలంలో రసాయన ఎరువులు వేయకుండా పంటలు సాగు చేయలేని పరిస్థితి. అయితే మండల పరిధిలోని సుద్దగుంట గ్రామానికి చెందిన రమేష్ వైద్యరంగంలో పని చేస్తున్నాడు. అయితే పుట్టింది రైతు కుటుంబంలో కావడంతో వ్యవసాయంపై ఉన్న ఆసక్తే అతన్ని పండ్ల తోటల సాగులపై ఆసక్తి పెంచుకోవడంతో అత్యధిక లాభాలు అందించే అధునాతన పంటను సాగి చేయాలని ఉత్సాహం ఉన్న వైద్యసిబ్బంది డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేయాలనే ఆలోచన రావడంతో కడప జిల్లాలోని యర్రగుంట, అదేవిధంగా గుంటూరు జిల్లాలో పర్యటించి పంట సాగులో మెలకులను నేర్చుకుని ప్రస్తుతం అర ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు చేస్తున్నారు. పంట నాటిన 9వ నెల నుంచి 25 ఏళ్లపాటు డ్రాగన్‌ఫ్రూట్ (ఫలసాయాన్ని ఫిబ్రవరి నుంచి నవంబర్ వరకు) పొందవచ్చని చెబుతున్నారు. ఈ సాగుకు మెట్ట ప్రాంత భూములు అనుకూలం.

**సాగు ఇలా..**

ఆరుగడుగుల ఎత్తు ఉండే స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ మట్టల నుంచి సేకరించిన విత్తనాన్ని సిమెంట్ స్తంభాల చుట్టూ నాటుకోవాలి. మూడు నెలల్లో సిమెంట్ స్తంభం చుట్టూ మొక్కలు విస్తరిస్తాయి. మరో ఆరు నెలల తర్వాత ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్స్ వస్తాయి. విస్తారంగా ఫలసాయం పొందాలంటే నవంబర్–ఫిబ్రవరి మాసాల మధ్య వచ్చే పూతను ఎప్పటికప్పుడు తొలగించాలి. అలా చేస్తే ఫిబ్రవరి నుంచి ఎక్కువ ఫలసాయం వస్తుంది. ఎకరానికి నాలుగు నుంచి పది టన్నుల వరకు ఫ్రూట్స్ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. చీడపీడలు ఆశించే అవకాశం లేకపోవడంతో రసాయన ఎరువులు, పురుగుల మందులను వినియోగించాల్సిన అవసరం ఉండదు. డ్రిప్ పద్ధతిలో రెండు రోజులకు ఒకసారి నీటిని అందించాలి. ఫ్రూట్స్ తొలగించిన రెమ్మలను(మట్టలు) నుంచి సొంతంగా విత్తనం తయారు చేసుకోవడం ద్వారా రైతు అదనపు ఆదాయం కూడా పొందవచ్చు. సేంద్రియ ఎరువుల వినియోగంతో పండ్ల నాణ్యత పెరుగుతుందని, రుచి బాగా ఉండడంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ కూడా ఉంటుందని రైతు చెబుతున్నారు.

**అబ్బురపరిచే ఔషధ గుణాలు..**

పుచ్చకాయ లాగా తియ్యని రుచి కలిగిన డ్రాగన్ ఫ్రూట్‌లో అబ్బురపరిచే ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, తెల్లరక్త కణాలు, పేగులకు మేలు చేసే 400 రకాల బ్యాక్టీరియా వృద్ధి, మలబద్ధకం నివారణ, రోగనిరోధక శక్తి పెంపొందించడం, జీర్ణాశయ రుగ్మతలను తొలగించే పీచు పదార్థాలు మెండుగా ఉన్నాయి.

**ప్రయోగాత్మకంగా..**



నాకున్న 10 ఎకరాల భూమిలో తొలుత అరు ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ పంట వేసేందుకు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించి విత్తనం తీసుకొచ్చా. నారు పోసి నాటాను. పంట మంచి దిగుబడి ఇచ్చింది. డ్రాగన్ ఫ్రూట్స్ నియోజకవర్గంలో ఎక్కడా లేదు. ఈ ఫ్రూట్‌కు మంచి గిరాకీ ఉంది. అయినా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా కేజీ రూ.100కే అమ్ముతున్నాను. ఇంకా ఐదు ఎకరాల్లో సాగు చేయడానికి సిద్ధం చేస్తున్నా.

– రమేష్, రైతు, సుద్దగుంట

**అర ఎకరానికి రూ.1.84 లక్షల సబ్సిడీ**



ఉపాధిహామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్స్ పెంపకానికి సంబంధించి అర ఎకరానికి రూ.1.84 లక్షలు సబ్సిడీ అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాం. నియోజకవర్గంలో తొలిసారి సుద్దగుంట గ్రామంలో పంట సాగు చేశారు. వారు ఉద్యోగస్తులు గనుక వారికి రుణ సౌకర్యం కల్పించలేకపోయాం. ఎవరైనా నిరుద్యోగులుగా ఉన్న రైతులు డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ముందుకొస్తే వారికి సబ్సిడీ కింద రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జాహ్నవి, ఉపాధిహామీ ఏపీఓ, కార్వేటినగరం

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

**నింద్ర:** మండలంలోని రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి తులసిరాం అన్నారు. సోమవారం మండలంలోని కర్పరవేడు, కేఆర్ పాళెం గ్రామంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పాత పద్ధతులను కొన్ని ప్రాంతాల్లో అనుసరించడం వల్ల పంటకు సాగుకు చేసిన ఖర్చు అధికంగా అవుతోందన్నారు. దీంతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టాలు తప్పడం లేదని తెలిపారు. సేంద్రియ పద్ధతులను అనుసరించడం వల్ల దిగుబడులు పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. పంటల సాగు కోసం నీటి సమస్యలు ఉన్న రైతులు డ్రిప్ పద్ధతి తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. అదేవిధంగా వరి పంట సాగు చేయాలనే రైతులకు కూలీల సమస్య నివారించడానికి వరినాట్లు యంత్రంలో వరినాట్లు వేయడం, డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### దేశభక్తిని పెంపొందించుకోండి



మట్టి దీపాలతో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**పుత్తూరు రూరల్:** స్వాతంత్య్ర సమరయోధులను స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డి.రాజా సూచించారు. సోమవారం పుత్తూరు రూరల్ మండలం రామసముద్రంలో నా భూమి– నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ×నా భూమి– నా దేశం¤ నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన సమర యోధులను అనుక్షణం స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. గ్రామస్తులతో కలిసి మట్టి దీపంతో పంచ్ ప్రాణ్‌ప్రతిష్ట చేసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, సారకాయలు, అమాసయ్య, బాలరాజు పాల్గొన్నారు.

### అర్హత ఉన్న వారికే వైఎస్సార్ పింఛన్ కానుక



పింఛన్‌కు ఎంపికైన వారి వివరాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ సందీప్


**కార్వేటినగరం:** అంగవైకల్యం ఉండి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ వస్తుందని ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ అధికారి డాక్టర్ సందీప్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ వైఎస్సార్ పింఛన్ కానుక స్కీమ్ వర్తిస్తుందని, దరఖాస్తులు చేసుకున్న వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆయన ప్రాథమి ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఆవరణలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బంది ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, ఎంపీహెచ్ఈఓ నాగరాజు, పర్యవేక్షకులు త్యాగరాజు, ఎంపీహెచ్ఎస్ లక్ష్మిపతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.


## స్పందన వినతులపై దృష్టి పెట్టండి

**శ్రీరంగరాజపురం:** స్పందనలో వచ్చే వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 17 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 11, శ్మశానానికి దారి సమస్యపై 1, ఇంటి నిర్మాణానికి డీకేటీ పట్టా కేటాయించాలని 5 వినతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

# పలు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

- కొన్నిచోట్ల ఎలక్షన్ తప్పనిసరి
- అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఎన్నికల అధికారులు





ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గంగయ్య, కత్తెరపల్లి సర్పంచ్‌గా ఏక గ్రీవమైన నవీనను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**కార్వేటినగరం:** గంగాధరనెల్లూరు మండలంలోని నెల్లేపల్లి సర్పంచ్‌గా కే.గంగయ్య ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శరవణరెడ్డి తెలిపారు. సోమవారం ఎన్నికల అధికారి మాట్లాడుతూ గతంలో నెల్లేపల్లి సర్పంచ్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిందన్నారు. ఈ నేపథ్యంలో నెల్లేపల్లి సర్పంచ్ అభ్యర్థిగా గంగయ్య ఒక్కడే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. అదేవిధంగా కొండేపల్లిలో ఇద్దరు వార్డు మెంబర్లు కూడా ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. వరత్తూరు గ్రామంలో వార్డు మెంబర్‌కు ఇద్దరు నామినేషన్ వేయడంతో ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. అందులో టీ.నాగరాజుకు ప్రెజర్‌కుక్కర్, మరో అభ్యర్థి ముద్దుకృష్ణకు గౌను గుర్తు కేటాయించినట్లు తెలిపారు.

**కత్తెరపల్లి సర్పంచ్‌గా చంద్రగిరి నవీన**

కార్వేటినగరం మండలంలోని కత్తెరపల్లి సర్పంచ్‌గా చంద్రగిరి నవీన ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గిరీష్‌కుమార్, ఎంపీడీఓ మోహన్ మురళి తెలిపారు. సోమవారం ఎన్నికల అధికారి మాట్లాడుతూ కత్తెరపల్లి గ్రామ సర్పంచ్ చంద్రగిరి చిరంజీవిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ స్థానానికి ఎన్నిక అనివార్యం అయిందన్నారు. ఉప ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఈ స్థానానికి నామినేషన్ వేసిన అభ్యర్థులు పలువురు తమ నామినేషన్లను ఉప సంహరించుకోవడంతో చిరంజీవిరెడ్డి భార్య చంద్రగిరి నవీన సర్పంచ్‌గా ఏకగ్రీవం అయిందన్నారు. అలాగే 4వ వార్డుకు రేఖయాదవ్ ఏక గ్రీవమైనట్లు ఎన్నికల అధికారి గిరీష్‌కుమార్ చెప్పారు. కత్తెరపల్లి సర్పంచ్‌గా చంద్రగిరి నవీన ఏకగ్రీవం కావడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, విశ్రాంత తుడాప్లానింగ్ అధికారి కే.కృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం సర్పంచ్ నవీనను నాయకులు, కత్తెరపల్లి గ్రామస్తులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మాజీ సర్పంచ్ మురగయ్య, డీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ బాలసుబ్రమణ్యరెడ్డి, పద్మనాభరెడ్డి, ధనశేఖర్‌వర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నెట్టేరి ఐదో వార్డు మెంబరుగా పార్వతమ్మ**

**నింద్ర:** మండలంలోని నెట్టేరి పంచాయతీ ఐదో వార్డు మెంబరుగా పార్వతి ఏకగ్రీవంగా అయినట్లు ఎన్నికల అధికారి శ్రీధర్‌రాజు బుధవారం తెలిపారు. ఈ స్థానానికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో బరిలో పార్వతమ్మ ఒక్కరే ఉండడంతో ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

**వేపగుంట బరిలో ఇద్దరే..**

**పుత్తూరు రూరల్:** మండల పరిధిలోని వేపగుంట గ్రామ పంచాయతీ 3వ వార్డు మెంబర్ ఎన్నికల బరిలో నుంచి ఏ.మణెమ్మ నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎం.మలర్‌వలి ప్రకటించారు. దీంతో ఏ.ఉష, ఏ.భారతి మాత్రమే పోటీలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఉషకు ప్రెషర్ కుక్కర్, భారతికి గౌనును ఎన్నికల గుర్తులుగా కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 19న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

## జగనన్నకు మరోసారి పట్టం కడదాం



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం జగనన్నదే
- మంత్రి ఆర్‌కే రోజా

**పుత్తూరు రూరల్:** ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండవసారి ముఖ్యమంత్రిగా పట్టం కడదామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖాల మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.36.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను మంత్రి రోజా ప్రారంభించారు. అనంతరం ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా మీ కుటుంబాన్ని ఆదుకుందా? అంటూ ప్రశ్నించారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 98 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్ వేలాయుధం, కోఆప్షన్ మెంబర్ రామ్‌బత్తయ్య, రూరల్ మండల కన్వీనర్ గోవిందస్వామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

**పాలసముద్రం:** దేశానికి స్వాతంత్య్రం తేవడం కోసం మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్‌ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కృష్ణజమ్మపురంలో ఏపీఓ మార్గరేట్, సర్పంచ్ భానుప్రియ సమక్షంలో నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ శ్యామల, వైస్ ఎంపీపీ శేఖర్ మాట్లాడుతూ దేశభక్తిని పెంచేందుకు, స్వాతంత్య్ర సమరయోధుల ఔన్నత్యాన్ని యువతకు తెలియజెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. శిలా ఫలకాన్ని ప్రారంభించి పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, జేఈ అనుషా, టెక్నికల్ అసిస్టెంట్ పరదేశి, సుబ్రమణ్యం, రంగనాయక్, పంచాయతీ శంఖర్, నాయకులు పద్మనాభనాయుడు, సుబ్రమణ్యం, తంగరాజ్, షణ్ముగరెడ్డి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## పాడి రైతులకు అండగా ప్రభుత్వం



గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేస్తున్న ఏడీ, ఎంపీపీ, జెడ్పీటీసీ

**పాలసముద్రం:** పాడి రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. సోమవారం పాలసముద్రం పశువైద్యశాల ఆవరణలో ఏడీ మురళి మోహన్, పశువైద్యాధికారి యశస్వీ ఆధ్వర్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన గడ్డి కత్తిరింపు యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల కోసం రూ.33,600 విలువజేసే గడ్డి కత్తిరింపు యంత్రాలను సబ్సిడీపై రూ.20,400లకే ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం పాడిరైతులకు సబ్సిడీపై దాణా, గడ్డి కత్తిరింపు యంత్రాలతో పాటు ఉచితంగా గ్రామాల్లో పశువులకు వైద్యసేవలు అందిస్తోందన్నారు. అనంతరం 10 మంది పాడిరైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివ ప్రకాష్ రాజు, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, పాడిరైతులు పాల్గొన్నారు.

## భాస్కర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**వెదురుకుప్పం:** మండలంలోని తిప్పినాయుడు పల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి సోదరుడు సదాశివరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి సోమవారం గ్రామంలో పర్యటించి సదాశివ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణ రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్, మాజీ మండల అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య, జగదీశ్ రెడ్డి ఉన్నారు.

### జెండాల పంపిణీ

**శ్రీరంగరాజపురం:** మండలంలోని తయ్యూరు సర్పంచ్ టి.వరదమ్మ తన సొంత డబ్బులతో పంచాయతీలోని గ్రామాలకు సోమవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరదమ్మ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగఫలితమే నేడు మనం ఆ ఫలాలను అనుభవిస్తున్నామని తెలిపారు. వారి ఆశయాలను, ఆలోచనలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జెండాలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ 77వ స్వాతంత్య్ర దినోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, నాయకులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## త్యాగమూర్తులను స్మరించుకుందాం



నగరి: కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్,



కార్వేటినగరం: విశ్రాంత సైనికుడికి సన్మానం

**నగరి:** భరతమాత స్వేచ్ఛ కోసం తమ కుటుంబాలను, ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుల నుంచి స్ఫూర్తి పొందడానికే నా మట్టి–నాదేశం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన నా మట్టి– నాదేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం గర్వించదగిన గాంధీజీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ వంటి వీరులను స్మరించుకోవడం, గౌరవించడం ప్రతి భారతీయుడి కర్తవ్యమన్నారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్‌రాజు, ఇందిరాప్రియదర్శిని, పంకజ, రేవతి, రమేష్, చిన్నపాపమ్మ, వేణుగోపాల్, శ్రీరామాంజులు, కిరణ్‌బాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**కార్వేటినగరంలో..**

**కార్వేటినగరం:** స్వాతంత్య్ర సాధన కోసం సమర యోధులు చేసిన పోరాట త్యాగాలను స్మరించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో కేఎం పురం, కొటార్వేడు గ్రామ పంచాయతీల్లో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని ఏపీఓ జాహ్నవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గొల్లకండిగ గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను తెలుసుకోవడం విద్యార్థుల బాధ్యత అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కళాశాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్, విద్యార్థులు పాల్గొన్నారు.